క్లుప్తంగా

భోగేశ్వర కల్యాణానికి 25న రాటపూజ

కైకలూరు(కలిదిండి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా ఈ నెల 25న ఉదయం 9.08 గంటలకు రాటపూజ జరుగుతుందని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) హాజరవుతారన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 20వ తేదీ వరకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఎంఎస్ఎంఈ స్కీమ్ ద్వారా రూ.40 కోట్ల రుణం

మండవల్లి: ఎంఎస్ఎంఈ స్కీమ్ ద్వారా తక్కువ వడ్డీతో రైతులకు రూ.20 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు రుణాలు అందిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ కేవీఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంక్‌ను శుక్రవారం మూర్తి సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి స్కీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ జోనల్ పరిధిలో ఈ స్కీమ్ కింద రూ.20 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉన్నాయని, పెద్ద రైతులు చేపల పెంపకానికి, భవన నిర్మాణాలకు, ల్యాండ్, ఫ్యాక్టరీలు, వాహనాల కొనుగోళ్లకు రుణం తీసుకుని లబ్ధి పొందవచ్చన్నారు. అర్హత కలిగిన ఖాతాదారులను గుర్తించి రుణాల మంజూరుకు ప్రయత్నించాలని స్థానిక మేనేజర్ దుర్గారావును కోరారు.

ఆళ్వార్ దాస్‌కు ఘన నివాళి

గుడివాడటౌన్: వాకర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి నడక ద్వారా ప్రజలకు ఆరోగ్యం కలుగుతుందనే సందేశాన్ని అందించిన అల్వార్దాస్ చిరస్మరణీయులని తారకరామ వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. స్థానిక జీవన్ పబ్లిక్ స్కూల్‌లో అల్వార్దాస్ వర్ధంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్‌క్లబ్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొనసాగడం ఆయన ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ అలీ, కార్యదర్శి మట్టుపల్లి బలరామ్, కోశాధికారి దాసరి సురేష్, మాజీ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కె.రామకృష్ణ, ఎం.బ్రహ్మయ్య, సాయి సుబ్రహ్మణ్యం, వాసు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



పామర్రు: దాతల సహకారంతో నిరుపేదలకు ఆహారపు పొట్లాలను అందజేశామని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆహారపు పొట్లాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామస్తులు పాలడుగు వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య త్రిపురనేని ప్రభావతి వితరణతో 40 మంది పేదలకు ఆహారం అందజేశారన్నారు. దాతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు వైఎస్ బోసు, ఉపాధ్యక్షుడు ఎమ్మార్కే ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి ఎస్.నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు వి.ఝాన్సీరాణి, టి.ప్రభావతి, టి.విజయలక్ష్మి, వి.నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో తేమ శాతం మిషన్



పెదపారుపూడి: ధాన్యం తేమ శాతం విషయంలో రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తేమ శాతం మిషన్ ద్వారా మరోసారి సరి చూసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పెదపారుపూడి ఆర్బీకేతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో తేమ శాతం మిషన్ రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు శాంపిల్ ధాన్యం తీసుకువచ్చి సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ బ్యాంక్‌ల కార్యదర్శులు నాగరాజు, నారాయణ పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రానికి చెక్కు అందజేత

కారకంపాడు(మొవ్వ): బందరు మాజీ ఎంపీ కొలుసు పెద్ద రెడ్డయ్య ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సభ్యులు శుక్రవారం గ్రామంలోని మాజీ ఎంపీ స్వగృహంలో రెడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణా క్షీర బంధు పథకం ద్వారా రెడ్డయ్య కుమారుడు, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే పాల సహకార సంఘ అభివృద్ధికి అందజేశారు. పాల సహకార సంఘం అధ్యక్షుడు కొలుసు దేవయ్య, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ, జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఆర్డీఓలు పద్మావతి, విజయ్‌కుమార్



మల్లాయపాలెం రైస్ మిల్లులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ పద్మావతి



చోరగుడిలో రైస్‌మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

గుడివాడరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని గుడివాడ, ఉయ్యూరు ఆర్డీఓలు పి.పద్మావతి, విజయ్‌కుమార్ ఆదేశించారు. నాగవరప్పాడు ఆర్బీకేను, మల్లాయపాలెంలోని ఓ రైస్ మిల్లులను శుక్రవారం ఆర్డీఓ పద్మావతి తనిఖీ చేశారు. ముందుగా రైస్‌మిల్లును సందర్శించి రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ప్రకారం రైతులకు ధర చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అనంతరం నాగవరప్పాడులోని రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది సూచనలను జారీ చేశారు. ప్రభుత్వం మిల్లులతో సంబంధం లేకుండా ఆర్బీకేల ద్వారానే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను అనుసరించి రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు ఏమైనా ఇబ్బందులు కలుగచేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలియజేశారు. రైతులు సైతం ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, తహసీల్దార్ కె.ఆంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు

పామర్రు(పమిడిముక్కల): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వేగవంతంగా సేకరించి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం చోరగుడి గ్రామంలోని ఆర్బీకేను, రైస్‌మిల్లులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. దళారులకు తావేలేకుండా నేరుగా ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసి వారికి దక్కాల్సిన మద్దతు ధరను ప్రతి పైసాతో సహా అనుకున్న సమయానికి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. 10 శాతం రంగు మారిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయాలని, ఇంకా ఎక్కువ శాతం రంగు మారిఉంటే మిల్లర్లతో మాట్లాడి కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం హమాలీ, రవాణా, గోనె సంచుల ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తూ రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఈ-క్రాప్ డేటా ఆధారంగా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఖరీఫ్‌లో మిగిలిన సేకరణనూ పూర్తి చేయాలని చెప్పారు. ఆర్బీకేలో ధాన్యం సేకరించగానే రైతుల పని ముగుస్తుందని, అనంతరం ప్రభుత్వానిదే మిగతా బాధ్యత అని అన్నారు. ఏమైనా సమస్యలు, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రవేయం ఉంటే ఫిర్యాదు చేయడానికి వీలుగా ఒక నంబర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని అన్నారు. రైతుల వద్ద నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

తోట్లవల్లూరు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొదని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య ఆదేశించారు. స్థానిక సొత్వల్లూరు, నార్తువల్లూరు ఆర్బీకేలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు వివరాలను వెంకటశివయ్య తెలుసుకోవటంతో పాటు గోనె సంచుల నిల్వలపై ఆరాతీశారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. రైస్‌మిల్లులకు టార్గెట్స్ పెంచామని, రైతులకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచామని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో మినీ మిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేసి టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా ధాన్యం నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసి, కొనుగోలు చేస్తామన్నారు. జనవరి 1 వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు, రవాణా చార్జీలు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదురైతే 98499 04000 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. వీఆర్వో నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకురాలు దీపిక, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పులపర్రు, కాకతీయనగర్ గ్రామాల్లో సర్పంచ్ వేంద్ర నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు దారా రమేష్ ఆధ్వర్యంలో డీఎన్నార్ శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

అర్హతే ప్రామాణికంగా..

అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మూడేళ్లలో అందజేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. గడప గడపలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు చేబోయిన వీర్రాజు, గుడివాడ తమ్మిస్వామి, ముంగర మల్లికార్జునరావు, బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, గుడివాడ మురళీకృష్ణ, అంకరాజు శ్యాంబాబు, ఎస్ఐ టి.రామకృష్ణ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లలిత, ఈఓపీఆర్డీ ఎస్‌వీ రాధిక, కార్యదర్శి ఎం.కొండలు పాల్గొన్నారు.

నేటి నుంచి ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండల కేంద్రమైన ముదినేపల్లిలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పథకాలు అమలు జరుగుతున్న తీరు గురించి తెలుసుకుంటారన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు.



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముస్సిపల్ కమిషనర్‌కు అభినందనలు



గుడివాడటౌన్: నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన పురపాలక సంఘ కమిషనర్ వి.మురళీకృష్ణను పట్టణానికి చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు, పలు బీసీ సంఘాల నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహరావు, పలు పార్టీలకు చెందిన నాయకులు వెంపల అప్పారావు, ఎ.మల్లేశ్వరరావు, పి.సత్యనారాయణ, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, ప్రధాన కార్యదర్శి టి.రమేష్, ఉపాధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, నాయకులు ఆర్.రామ్‌సాగర్, లోయ రామకృష్ణ, రంగారావు, ఎస్ బసవన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలి



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

గుడివాడటౌన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలని ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి) అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో వేములపల్లి వెంకటేశ్వరరావు మెమోరియల్ ప్రీమియర్ లీగ్ పోటీలు 2023ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఇంటర్మీడియెట్ విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. బాలురకు కబడ్డీ, క్రికెట్, బాలికలకు కబడ్డీ, త్రోబాల్ పోటీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డాక్టర్ వై.రోజా, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు నెరుసు శేషగిరిరావు, బొగ్గారపు తిరుపతయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, లీగ్ కో-ఆర్డినేటర్ కె దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలపై సమీక్ష



దొండపాడులో అవగాహన కల్పిస్తున్న పృథ్వీ

గుడివాడరూరల్: నవరత్నాల్లో భాగంగా ప్రతి కుటుంబానికి గూడు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పంచాయతీ కార్యదర్శి స్నేహలత పేర్కొన్నారు. మండల పరిధిలోని దొండపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగనన్న గృహ నిర్మాణాల పురోగతిపై లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్నేహలత మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు రుణాలను గృహ నిర్మాణశాఖ ద్వారా మంజూరు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం నిర్మాణాల విషయంలో పూర్తి సహకారం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల నుంచి ఇంటి నిర్మాణాలపై భరోసా తేదీలను పంచాయతీ సిబ్బంది తీసుకున్నారన్నారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ పృథ్వీ, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతి అందజేస్తున్న సెబ్ సీఐ రాంబాబు, సర్పంచ్ నవరత్నకుమారి

కైకలూరు: ఎస్ఐ, కానిస్టేబుళ్ల పరీక్షలకు సిద్ధమవుతోన్న విద్యార్థులకు యువభారత్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 15న హోలీ క్రాస్ స్కూల్‌లో మోడల్ పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గం నుంచి మొత్తం 80 మంది పాల్గొన్నారు. విజేతలకు కైకలూరు కోచింగ్ సెంటర్ వద్ద బహుమతులు అందించారు. మొదటి బహుమతి రూ.10 వేలు ఓ.సువర్ణ, రెండో బహుమతి రూ.5 వేలు పి.పాండురంగారావు, మూడో బహుమతి రూ.వెయ్యి సత్యనారాయణ దక్కించుకున్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ ఎస్.రాంబాబు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, హోలీక్రాస్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ ప్రవీణ్, యువ భారత్ కోచింగ్ నిర్వాహకులు రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గన్నవరం: గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ వైపు వెళ్తున్న ఆటోను గ్యాస్ కంపెనీ వద్ద వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన కల్వర్ట్‌పై కూర్చొన్న వ్యక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. విచారణ చేపట్టారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



పామర్రులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న తానా అధ్యక్షుడు వెంకటరమణ, ఆంజనేయులు



గుడివాడలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పామర్రు: తానా ఫౌండేషన్ ఉయ్యూరు రోటరీ క్లబ్(కేసీపీ) వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పాల శీతల కేంద్రం కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో పామర్రు పరిసర ప్రాంతాల నుంచి కృష్ణామిల్క్ యూనియన్ తరఫున పాల ఉత్పత్తిదారులు 1,500 మందికి పైగా వచ్చి కంటి వైద్య పరీక్షలను చేయించుకున్నారు. తొలుత వైద్యశిబిరాన్ని తానా ఫౌండేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటరమణ, కృష్ణామిల్క్‌యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. తానా అధ్యక్షుడు వెంకట రమణ మాట్లాడుతూ తానా చైతన్య స్రవంతి అనే కార్యక్రమం ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు. చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. శిబిరంలో ఉయ్యూరు రోటరీక్లబ్ కంటి వైద్యులు పాల్గొని వైద్య సేవలను అందజేశారు. 250 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించామని వీరికి త్వరలో కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. 100 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించామని వీరికి త్వరలో ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరరావు, బోర్డు డైరెక్టర్లు వేమూరి సాయి వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, జె.హరిరామ కోటిరెడ్డి, సుజాత, మేనేజర్ చిట్టూరి దామోదరం కృష్ణ గోపీనాథ్, సూపర్‌వైజర్లు కైలా రమేష్‌బాబు, సురేష్, బాషా, శ్రీను పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావు శుక్రవారం తెలిపారు. స్థానిక మందపాడులోని పురపాలక సంఘ వృద్ధాశ్రమంలోని అనాథలకు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్.శేషగిరిరావు, ఉరిటి రామారావు, చిన నారాయణరెడ్డి, డాక్టర్ శ్రీశాంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ర్యాలీ



మచిలీపట్నంటౌన్: 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోనేరు సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటరు వరకు పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పాటించాలని నినదిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ప్రారంభించారు. ర్యాలీలో జేసీతో పాటు జిల్లా అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు, ఏఎస్పీ సీహెచ్ రామాంజనేయులు, డీఎస్పీ మాసూంబాషా, దిశ డీఎస్పీ పి.రాజీవ్‌కుమార్, జిల్లా రవాణాధికారి పి.సీతాపతిరావు, జిల్లా ప్రజారవాణాధికారి జి.నాగేశ్వరరావు, ఆర్టీసీ డీఎం టి.పెద్దిరాజు పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు ప్రమాదాలకు తావు ఇవ్వకుండా ప్రయాణాలు సాగించాలన్నారు. ర్యాలీలో ఎంవీఐలు బీఎస్ఎస్ నాయక్, ఎండీఎల్ సిద్దిఖ్, డి సోనీప్రియ, పలు కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు పాటించాలి



అడ్డాడలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ స్వర్ణలత

పామర్రు: మినుములో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత అన్నారు. మండల పరిధి అడ్డాడ, కొమరవోలు గ్రామాల్లోని మినుము పంటను శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ప్రస్తుతం మినుము పంటలో సీతాఫలం తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల డైమిథోమేట్ లేక 1.5 మిల్లీ లీటర్ల మోనోక్రోటోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తొలుత తెగులు సోకిన మొక్కలను పీకి తగల బెట్టాలన్నారు. దీని వల్ల మినుము సాగులో దిగుబడులు పెరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ శివ నాగరాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తక్కువ వ్యయంతో అధిక లాభాలు పొందాలి

ముదినేపల్లి రూరల్: మినుము సాగులో తక్కువ వ్యయంతో అధిక లాభాలు సాధించాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని గురజలో మినుము పైరుపై పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. పైరుపై తెగుళ్లు, పురుగులు సోకితే నష్ట పరిమితికి లోబడి మాత్రమే మందులు వాడాలన్నారు. ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఖరీదైన మందులను వినియోగిస్తే వృథా వ్యయం మినహా ఎలాంటి లాభం ఉండబోదన్నారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ.. మినుము పంటలో వేరుకుళ్లు తెగులు గమనించామన్నారు. దీని నివారణకు ట్రైకోడెర్మా విరిడి జియోశిలింధ్ర మందును ఎకరానికి రెండు కిలోల వంతున పిచికారీ చేయాలని చెప్పారు. పలు రకాల వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చు పురుగులను అరికట్టేందుకు 5 శాతం వేప గింజల కషాయం లేదా లీటరుకు 5 మిల్లీలీటర్ల వేపనూనెను కలిపి ఎకరానికి 200 లీటర్ల మందునీటిని పిచికారీ చేయాలని సూచించారు. పొలంగట్లపై కలుపు లేకుండా చూడాలని తెలిపారు.

తెగుళ్లతో అప్రమత్తత అవసరం..

కైకలూరు: రైతులు అపరాల సాగులో వచ్చే తెగుళ్లపై అప్రమత్తంగా వ్యవహరించాలని కై కలూరు వ్యవసాయశాఖ ఏడీ ఆర్.గంగాధరరావు చెప్పారు. మినుము సాగుపై వింజరం గ్రామంలో రైతులతో కలిసి శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం 45-50 రోజుల దశలో మినుము పంట ఉందన్నారు. ఈ సమయంలో వచ్చే తెగుళ్లపై వ్యవసాయాధికారి ఆర్.దివ్యతో కలసి నివారణ మార్గాల్ని వివరించారు. ఏడీ మాట్లాడుతూ బూడిద తెగులు గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు చిన్నగా తెల్లటి మచ్చలు ఏర్పడి క్రమేపీ వలయాలుగా మారి, తర్వాత ఆకుల నుంచి కొమ్మలకు పూత, పిందె, కాయల మీద ఏర్పడతాయన్నారు. హెక్సాకోనాజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో లేదా ప్రొపికోనజోల్ 1 మిల్లీలీటరు లీటరు నీటిలో లేదా మైక్లో బూటానిక్ 1 గ్రాము లీటరు నీటిలో 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. ఎండుతెగులు మొక్క పెరుగుదల దశ నుంచి పూత, పిందె, కోత దశ వరకు వ్యాప్తి చెందుతుందన్నారు. లవణ సాంద్రత లోపం ఉన్నప్పుడు లేత ఆకుల చివరలు పసుపుగా మారి క్రమేణా ముదురు గోధుమ రంగులోకి మారతాయన్నారు. పొటాషియం నైట్రేట్ 2 శాతం వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని ఏడీ సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుడివాడరూరల్: రైతులు మినుము పంటకు సంబంధించి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మచిలీపట్నం జలవనరుల కేంద్రం డీఆర్సీ డీటీసీ కె.జ్యోతిరమణి అన్నారు. మండలంలోని లింగవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మినుము పైరును శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం నందివాడ, పెదపారుపూడి, గుడివాడ మండలాలకు సంబంధించిన వ్యవసాయశాఖ అధికారులతో గుడివాడ ఏడీఏ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక కార్యక్రమాలను ప్రవేశపెడుతుందన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మచిలీపట్నం జలవనరుల కేంద్రం ద్వారా శాస్త్రవేత్తలు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు విలువైన సూచనలు, సలహాలు జారీ చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇప్పటికే ఆర్బీకేల ద్వారా మిల్లులతో సంబంధం లేకుండా ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి, నందివాడ, పెదపారుపూడి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.